క్లుప్తంగా

మంత్రి విశ్వరూప్ పరామర్శ



పితృవియోగంతో బాధపడుతున్న సుంకర సుధను పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన ఒకటో వార్డు మున్సిపల్ కౌన్సిలర్ సుంకర పార్వతి భర్త సుంకర సుధ తండ్రి సత్యనారాయణ అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కౌన్సిలర్ పార్వతి ఇంటికి రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ వెళ్లి పరామర్శించారు. సత్యనారాయణ మృతదేహంపై పుష్ప గుచ్ఛం ఉంచి సంతాపం తెలిపారు. పరామర్శించినవారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కల్వకొలను బాబి, కుడుపూడి శాంతిభూషణ్ తదితరులున్నారు.

పూడితతీత పనులకు నిధుల మంజూరు

అల్లవరం: మండలంలోని బెండమూర్లంక పంచాయతీ పరిధిలోని చుంచులా మైనర్ డ్రెయిన్‌లో పూర్తి స్థాయిలో పూడిక తీయకుండా వదిలేయడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుమారు నాలుగు వందల ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది. డ్రెయిన్‌లో పూర్తి స్థాయి పూడిక తీత పనులు నిర్వహించాలని కోరుతూ గురువారం ఆ గ్రామ రైతులు ఎంపీడీఓని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో మాట్లాడారు. డ్రెయిన్‌లో పూడికతీత పనులకు రూ.50 వేల నిధులను జిల్లా కలెక్టర్ మంజూరు చేశారని ఎంపీడీఓ తెలిపారు. నిధులు మంజూరు చేసిన కలెక్టర్‌కు రైతులు ముత్యాల విజయసారథి, కుమార్, గోపాలకృష్ణ, స్వామి, గెద్దాడ వెంకటకృష్ణ, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు తదితరులు

ముమ్మిడివరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం మండలంలోని కొత్తలంక, మర్లపాలెం గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు గుత్తుల కల్యాణి, విత్తనాల నాగబ్రహ్మేశ్వరరావుల అధ్యక్షతన అవగాహన సదస్సులు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 14 పథకాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు వివరించారు. ఆయా పథకాలపై డాక్యుమెంటరీ, పీఎం నరేంద్రమోదీ ప్రసంగం వినిపించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, ఎంపీడీఓ జె.రాంబాబు, మండల ప్రత్యేకాధికారి కె.రవికుమార్, బీజేపీ జోనల్ ఇన్‌చార్జ్ జి.వెంకటేశ్వరరావు, డా.రాహుల్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి రూ.25 వేల సాయం

యానాం: అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక కామిశెట్టివారి వీధికి అద్దేపల్లి సత్యనారాయణకు సహాయ ఫ్రాన్స్ క్లబ్ సభ్యులు రూ.25 వేలు సమకూర్చి తమ ప్రతినిధి కిషోర్ ద్వారా గురువారం అందజేశారు. కొల్లాటి సరళ, క్రాంతి, మద్దింశెట్టి జయ, శాంతి, జ్యోత్స్న, జీవాణి, హజిరాఖాన్, లత గల్ల, రాధ జిన్నూవురు, సుష్మా తదితరులు ఈ మొత్తాన్ని సమకూర్చారు. యానాం నుంచి ఫ్రాన్స్ వెళ్లి ఇక్కడి వారికి కష్టమొస్తే సాయం చేస్తున్న క్లబ్ సభ్యులను స్థానికులు అభినందించారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు కల్పించాలి

అమలాపురం టౌన్: మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరుతూ స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించి వినతి పత్రాన్ని ఎంఈవో గుబ్బల సూర్యప్రకాశానికి అందజేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ముమ్మిడివరం: తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు కోరారు. గురువారం మండలంలోని అయినాపురం, కొత్తలంక, మర్లపాలెం గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో పి.ఉదయ భాస్కరవర్మ, వడ్డి నాగేశ్వరరావు, ముషిణి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో కాంగ్రెస్ సంబరాలు

అమలాపురం టౌన్: తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం మధ్యాహ్నం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు స్థానిక గడియారం స్తంభం సెంటరులో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, దేవరపల్లి రాజేంద్రబాబు, గెద్దం సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



డ్రెయిన్‌లో ఇసుక మేటల తొలగింపు పనులు పరిశీలిస్తున్న అమలాపురం ఆర్డీఓ కేశవవర్ధనరెడ్డి



జి.వేమవరంలో మొలకలు వచ్చిన వరి పనలను అధికారులకు చూపిస్తున్న రైతులు



వరి చేలో ఉప్పు నీటి ద్రావణం పిచికారీ చేయిస్తున్న ఏడీఎం రామారావు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..

- రైతులకు అండగా నిలిచే ప్రభుత్వమిది
- ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

అమలాపురం రూరల్: మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులెవరూ అధైర్యపడొద్దని, బాధితులందరికీ అండగా ఉంటామని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు భరోసా ఇచ్చారు. గురువారం ఆయన అమలాపురం రూరల్ మండలంలోని నడిపూడి, పాలగుమ్మి గ్రామాల్లో పర్యటించారు. కుండపోత వర్షాల వల్ల దెబ్బ తిన్న వరి చేలను పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అన్నివేళలా అండగా నిలిచే ప్రభుత్వమన్నారు. భారీ వర్షాల కారణంగా తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తుపాను కారణంగా నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందేలా చూస్తామని చెప్పారు. పంట నష్టాలపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో చర్చించి బాధిత రైతులకు ప్రభుత్వపరంగా న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. విపత్కర సమయంలో ఓఎన్‌జీసీ, గెయిల్ వంటి చమురు సంస్థలూ రైతులను ఆదుకునేందుకు ముందుకు రావాలన్నారు. ఎమ్మెల్సీ వెంట మండల ప్రత్యేక అధికారి జ్యోతిలక్ష్మి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సెంట్రల్



నడిపూడిలో వర్షాలకు దెబ్బతిన్న వరి పనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, మండల వ్యవసాయాధికారి ధర్మప్రసాద్, ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు, సర్పంచ్ చెల్లుబోయిన నాని తదితరులున్నారు.

ఇసుక మేటల తొలగింపు పనుల పరిశీలన

కాట్రేనికోన: మండలంలోని కూనవరం స్ట్రైట్ కట్ డ్రెయిన్‌లో పేరుకు పోయిన ఇసుక మేటల తొలగింపు పనులను అమలాపురం ఆర్డీఓ కేశవవర్ధన్ రెడ్డి గురువారం పరిశీలించారు. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు అమలాపురం, కూనవరం, గొల్లవిల్లి, గాడవిల్లి, కాట్రేనికోన, వేట్లపాలెం, ఎన్.కొత్తపల్లి తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు, వరి చేలు ముంపు నీటిలో ఉన్నాయి. ముంపు నీరు దిగేందుకు డ్రైన్‌లో ఇసుక మేటలు అడ్డుగా ఉండటంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. కూనవరం డ్రైనుకు అనుసంధానంగా ఉన్న డ్రైన్లలోనూ పూడికతీత పనులు చేపట్టారు. పూడికలు తొలగించడంతో ముంపు నీటిలో ఉన్న లోతట్టు ప్రాంతాలు, వరి చేలు కొంత మేరకు బయటపడ్డాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ముంపు నీరు దిగేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు

తాళ్లరేవు: మండల పరిధిలోని జి.వేమవరంలో భారీ వర్షాల వల్ల ముంపునకు గురైన పంట పొలాలను ప్రత్యేకాధికారి విజయకాంతి, వ్యవసాయాధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వర్షానికి మునిగిపోయిన వరి పనలను వారికి చూపించారు. సాగుకు వేలాది రూపాయిలు పెట్టుబడిగా పెట్టామని, పంట చేతికొస్తున్న దశలో భారీవర్షాలతో ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయామని అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వం ద్వారా పంట నష్టపరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తుల్యభాగ వద్ద లాకులు ఏర్పాటుచేయాలని కోరారు. లాకులు లేకపోవడంతో పైభాగం నుంచి వస్తున్న నీరు చేలల్లోకి ప్రవేశించి నష్టాన్ని కలుగజేస్తుందన్నారు. తహసీల్దార్ ఎస్.పోతురాజు, సర్పంచ్ సూరిబాబు, ఎంపీటీసీ యర్రంనీటి అప్పారావు, వ్యవసాయ అధికారి ప్రశాంతి, గ్రామ కమిటీ కన్వీనర్ గండి రామాంజనేయులు, సత్తిబాబు, అప్పారావు పాల్గొన్నారు.

ఉప్పు నీటి ద్రావణం చల్లండి

కాట్రేనికోన: తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురు గాలులకు ముంపు నీటిలో ఉన్న వరి చేలు, తడిచిన పనలు, ధాన్యంపై 5 శాతం ఉప్పు ద్రావణాన్ని చల్లాలని ముమ్మిడివరం వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎంఎస్‌వీ రామారావు అన్నారు. మండలంలో ముంపు నీటిలో ఉన్న వరి చేలను, నీట మునిగిన పనలను, కళ్లాల్లో తడిసిన ధాన్యం రాసులను ఆయన పరిశీలించారు. ఉప్పూడి, చెయ్యేరులో ముంపు నీటి నుంచి బయట పడిన వరి చేలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయించారు. పల్లంకుర్రు, కందికుప్పలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులు అధైర్య పడవద్దని, ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు అవసరమైన కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో కత్తి తిప్పిన మంత్రి విశ్వరూప్



భేతాళస్వామి ఉత్సవాల్లో కత్తులు తిప్పుతున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువులో గురువారం రాత్రి జరిగిన భేతాళస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ కొద్దిసేపు కత్తులు తిప్పి అక్కడి యువతను ఉత్సాహపరిచారు. ఉత్సవాల్లో నిర్వహించే చెడీ తాలింఖానా ఉత్సవాల్లో మంత్రి విశ్వరూప్ కత్తులు తిప్పుతున్న దృశ్యాన్ని గ్రామస్తులతో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, పార్టీ నాయకులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా చంద్రశేఖర్, రాజులపూడి మురళీ, ఈతకోట శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థుల ప్రతిభ

యానాం: ఈ నెల 1 నుంచి 2వ తేదీ వరకూ హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో యానాం నవోదయ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు గురువారం తెలిపారు. చెద పురుగుల నివారణకు సహజ సిద్ధమైన వనరులను ఉపయోగిస్తూ విద్యార్థి మేడా శివాజీ చేసిన రీసెర్చ్ బేస్డ్ ప్రాజెక్టుకు ప్రథమ స్థానంతో పాటు పండ్లు, కూరగాయల వ్యర్థాల నుంచి మధుమేహం లాంటి వ్యాధులకు ఉపశమనం కలిగించే మందులు తయారుచేసేలా విద్యార్థి కౌశిక్ చేసిన ప్రాజెక్టు సైతం బహుమతి లభించిందన్నారు. దేశవ్యాప్తంగా 8 రీజియన్ల నుంచి 77 మంది నవోదయ విద్యార్థులు పాల్గొనగా వాటిలో 8 ప్రాజెక్టులను ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మార్గదర్శనం చేసిన సైన్స్ అధ్యాపకులు సాంబశివరావు, లక్ష్మయ్య, పైడిరాజు, రాహుల్ ద్వివేదిలను అభినందించారు



బహుమతులు పొందిన విద్యార్థులు కౌశిక్, శివాజీ

బాధితులకు సాయం అందజేత

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రు పంచాయితీ పరిధి జైబుద్ధనగర్‌లో ఇటీవల తుపాను కారణంగా దునపాటి కొండలరావు తాటాకిల్లు కూలిపోయింది. జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ బాధిత కుటుంబానికి గురువారం టార్పాలిన్, హైజనిక్ కిట్, 25 కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే సాయం కూడా అందేలా చూస్తామన్నారు. ఆయన వెంట వైస్ చైర్మన్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సొసైటీ అధ్యక్షుడు ఇందుకూరి రంగరాజు, శీలం వెంకటరమణ, సుబ్బరాజు, పెమ్మిరెడ్డి చంటి, రత్న ప్రసాద్, సముదాల పాలెపు లక్ష్మి తదితరులున్నారు.



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న నాయకులు

ఫైనాన్స్ కమిషన్‌లో చేర్చేలా ఒత్తిడి తేవాలి

యానాం: పుదుచ్చేరికి నిధులు వచ్చేందుకు 16వ ఆర్థిక సంఘంలో చేర్చేలా ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని మాజీ ఎంపీ ఎం.రామదాసు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటుచేసిన పుదుచ్చేరి స్టేట్ పీపుల్స్ డెవలప్‌మెంట్ పార్టీ(పీఎస్‌పీడీపీ) స్టేట్‌హుడ్ సాధనే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఫైనాన్స్ కమిషన్‌లో చేరడం వల్ల ఇతర రాష్ట్రాలకు కేంద్రం కేటాయిస్తున్న విధంగా కోట్లాది రూపాయిలు పుదుచ్చేరికి సైతం వస్తాయన్నారు. పుదుచ్చేరి ఫైనాన్స్ కమిషన్ పరిధిలో లేకపోవడంతో సంక్షేమ కార్యక్రమాలకు, స్థానిక సంస్థలకు నిధులు అందని పరిస్థితి ఉందన్నారు.

రాజులపాలెం అభివృద్ధికి రూ.27 కోట్లు

పి.గన్నవరం: రాజులపాలెం గ్రామంలో అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా జగనన్న ప్రభుత్వం ఇంతవరకూ రూ.27 కోట్ల మేర వెచ్చించిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు తెలిపారు. 'ఏపీకి సీఎం జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో నిర్వహించారు. అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును, పార్టీ పతాకాన్ని కన్వీనర్ వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, సొసైటీ చైర్మన్ మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, పార్టీ నాయకులు గుత్తుల మధు, నక్కా గోపి, జల్లి పండు పాల్గొన్నారు.



రాజులపాలెంలో అభివృద్ధి పనుల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

ఊట కాలువలో పూడికతీత

యానాం: నియోజకవర్గ పరిధిలోని మెట్టకూరు, రామన్నకోడు ప్రాంతాల పంట పొలాల నుంచి వచ్చే డ్రెయిన్ నీరు దిగే ఊట కాలువలో గురువారం పూడికతీత పనులు చేపట్టారు. గత ఐదేళ్లుగా ఊట కాలువను బాగుచేయాలని అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోలేదని, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ దృష్టికి తీసుకెళ్లగానే సమస్య పరిష్కరించారని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఊటకాలువలో పూడికతీత పనులతో త్వరితగతిన ఊటనీరు దిగిపోవడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. సహకరించిన ఎమ్మెల్యే అశోక్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాఘవులు చిరస్మరణీయుడు

అమలాపురం టౌన్: అసంఘటిత కార్మికుల కోసం రాజీలేని పోరాటాలు చేసిన కేవీ రాఘవులు చిరస్మరణీయుడని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు అన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో కేవీ రాఘవులు 13వ వర్ధంతి సభ నిర్వహించారు. సభలో సీపీఐ నాయకురాలు బి.కృష్ణవేణి, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి డీబీ లోక్, నిమ్మకాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకు బయలుదేరిన అయ్యప్పస్వాములు



నడవపల్లి నుంచి శబరిమలైకు బయలుదేరిన స్వాములు

కాట్రేనికోన: మండలంలోని నడవపల్లి, చింతల మెరక, కాట్రేనికోనకు చెందిన అయ్యప్పస్వాములు గురువారం శబరిమలైకు బయలుదేరారు. కఠోరమైన నియమ నిష్ఠలతో 41 రోజుల మండల దీక్షను చేపట్టిన స్వాములు నడవపల్లి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఇరుముడులు కట్టుకుని అయ్యప్పస్వామి దర్శనానికి పయనమయ్యారు. భక్తులు అధిక సంఖ్య పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

క్రాప్ ఇన్సూరెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి

యానాం: ఈ నెల 15లోగా రైతులు క్రాప్ ఇన్సూరెన్స్‌కు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని పుదుచ్చేరి వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.వసంతకుమార్ గురువారం కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ క్రాప్ ఇన్సూరెన్స్ పథకం అమలు చేస్తుందన్నారు. వరి, చెరకు, పత్తి, అరటి, అపరాలు తదితర పంటలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. బీమా సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా అందిస్తుందన్నారు. ఈ రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు రైతులు ఇన్సూరెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రైస్‌మిల్లు వ్యర్థాల పొగతో ఇబ్బందులు

యానాం: నియోజకవర్గ పరిధిలో దొమ్మేటిపేట ఇండస్ట్రియల్ కాలనీ ఎదురుగా ఉన్న రైస్‌మిల్లుకు చెందిన వ్యర్థాలను ఏటిగట్టు వద్ద పడేసి కాలుస్తుండడంతో పొగలు వ్యాపించి ఇబ్బందులు పడుతున్నామని చుట్టుపక్కల నివాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నాయకుడు జనిపల్లి వెంకన్నబాబు మాట్లాడుతూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

- ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి
- ఐ.పోలవరంలో మండల పరిషత్ సమావేశం

ఐ.పోలవరం: మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి అన్నారు. గురువారం ఐ.పోలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాలులో జరిగింది. సమావేశంలో విద్యుత్, ఇరిగేషన్, వ్యవసాయ తదితర శాఖల అధికారులు తమ ప్రగతిని వివరించారు. అనంతరం తిళ్లకుప్ప సర్పంచ్ కడియం తమ్మయ్య మాట్లాడుతూ తుపాను కారణంగా పంట నష్టం తీవ్రంగా ఉందని, రైతులను ఆదుకుని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులెవరూ అధైర్య పడొద్దన్నారు. తడిసిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని సైతం కొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు మాట్లాడుతూ అధికారులు పంట నష్టంపై అంచనాలు తయారుచేస్తున్నారని, ప్రభుత్వానికి నివేదిక వెళ్లగానే బాధితులకు సాయం అందజేస్తారన్నారు. సమావేశంలో జి.వేమవరం సొసైటీ అధ్యక్షులు మెండా వెంకన్న బాబు మాట్లాడుతూ గ్రామంలో మంచి నీటి ట్యాంకులు నిర్మించారని, దానికి సంబంధించిన పైపులైన్ పనులు పూర్తి చేయాలని కోరారు. కేశనకుర్రు సర్పంచ్ బీరసత్య కుమారి మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి సమస్య ఉందని సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో వివిధ శాఖల్లో ఉన్న సమస్యలను పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ చైతన్య కల్యాణ్ బదులిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఝాన్సీకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సహకార సంఘ అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి

మగ్గం, జర్దోసిపై ఉచిత శిక్షణ

అమలాపురం టౌన్: మహిళలకు స్వయం ఉపాధి కోసం శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో స్థానిక శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో 37 రోజుల పాటు మగ్గం, జర్దోసిపై అందించిన ఉచిత శిక్షణ గురువారంతో ముగిసింది. అమలాపురం పట్టణం, పరిసర గ్రామాలకు చెందిన 75 మంది మహిళలు శిక్షణ పొందారు. మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులేయాలన్న సంకల్పంతో శిక్షణ అందించామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమం ముగింపు సభకు మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ హాజరవుతారని చెప్పారు. శిక్షణకు అమలాపురం డివిజన్ సత్యసాయి సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్, సత్యసాయి భక్తులు సహకారం అందించారు.



అమలాపురంలో మగ్గం, జర్దోసిపై శిక్షణ పొందుతున్న మహిళలు

హరిహర మహాయజ్ఞానికి విస్తృత ఏర్పాట్లు

యానాం: గౌతమీ గోదావరి తీరంలో పవిత్ర కార్తిక మాసం పురస్కరించుకుని ఈ నెల 10న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న హరిహరమహాయజ్ఞానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక ఫెర్రీ రోడ్డులో వేలాది మంది భక్తుల కోసం సుమారు 10 ఎకరాల ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలనే మహాసంకల్పంతో ఈ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మహాయజ్ఞానికి యానాం నుంచే కాకుండా ఆంధ్రా ప్రాంతం నుంచి సైతం ప్రజాప్రతినిధులను, ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అందరికీ ఆహ్వానపత్రాలు పంపామన్నారు. ఈ నెల 10వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచే గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్ వరుణ, దీక్షాధారణ పూజలు ఉంటాయయ్యారు. 11 గంటల నుంచి మహాఅన్నసమారాధన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా నేపాల్ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన రుద్రాక్షలతో అర్చన చేసి వాటిని భక్తులకు పంపిణీ చేస్తామన్నారు. శాంతికల్యాణం, జ్యోతిర్లింగార్చన, గోదావరి హారతి అనంతరం ప్రసాద వితరణ ఉంటుందన్నారు.



యానాం గౌతమీగోదావరి తీరంలో మహాయజ్ఞానికి చేస్తున్న ఏర్పాట్లు

విద్యార్థులకు సైకిళ్ల బహూకరణ

పి.గన్నవరం: అమలాపురం అంబేడ్కర్ భవన్‌లో గురువారం జిల్లా స్థాయిలో నిర్వహించిన ధీరూబాయి అంబానీ క్విజ్ పోటీల్లో పి.గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఫైనల్స్‌కు అర్హత సాధించారు. దీంతో వారిద్దరికీ రిలయన్స్ సంస్థ ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అధికారి కమలకుమారి చేతుల మీదుగా సైకిళ్లను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు బహూకరిస్తున్న డీఈఓ కమలకుమారి